# దక్షిణ చైనా సముద్రంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు

**దక్షిణ** చైనా సముద్రంలో చైనా పేర్కొన్న ప్రాంతీయ హక్కులకు వ్యతిరేకంగా 2013లో ఫిలిప్పీన్స్ ఇచ్చిన 15 వివరణలన్నింటినీ సమర్ధించుతూ ఐక్యరాజ్యసమితి ఏర్పరచిన హేగ్‌లోని శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం(పిసిఏ) తీర్పు నిచ్చింది. ఐక్యరాజ్యసమితి రూపొందించిన సముద్ర చట్టాల సదస్సు (యుఎన్‌సిఎల్‌ఓఎస్) కనుగుణంగా ఈ తీర్పు ఇవ్వబడింది.

చైనా, తైవాన్, ఫిలిప్పీన్, మలేసియా, బ్రూనై, వియత్నాంలను తాకుతూ 30 లక్షల చదరపు కి॥మీ దక్షిణ చైనా సముద్రం(ఎస్‌సిఎస్) విస్తరించి వుంది. దక్షిణచైనా సముద్ర పరిధిలోవున్న 250 చిన్న చిన్న దీవులు, దిబ్బలు, ద్వీపాలలో అత్యధిక భాగంలో ప్రజలు నివసించటంలేదు. దక్షిణ చైనా సముద్రంగుండా వెళ్ళే ఒకానొక పెద్దదైన నౌకా మార్గంద్వారా 5.3 ట్రిలియన్ డాలర్ల విలువైన వ్యాపారం జరుగుతోంది. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో 1100 కోట్ల బ్యారెళ్ళ చమురు, 190 ట్రిలియన్ ఘనపుటడుగుల సహజవాయువు నిక్షేపాలున్నాయని భావిస్తున్నారు.

పారాసెల్ ద్వీపాలు, స్కార్ బరోషాల్, స్ప్రార్లీ ద్వీపాలైన ప్రాటాస్ మరియు మాక్లాస్‌ఫైడ్ బ్యాంక్ ద్వీపాలు వివాద కేంద్రంగా వున్నాయి. నైన్ – డ్యాష్ రేఖగా పిలవబడే దానివరకూ దక్షిణచైనా సముద్రంలో తన సార్వభౌమాధికారాన్ని చైనా ప్రజారిపబ్లిక్ పేర్కొంటున్నది. ప్రజారిపబ్లిక్‌గా చైనా రూపొందిన 1949 నాటినుండే వియత్నాం, ఫిలిప్పీన్, తైవాన్, మలేసియాలతో వివాదాలు నెలకొని వున్నాయి. పారాసెల్ ద్వీపాలను చైనా స్వాధీనం చేసుకున్న సమయంలో 1974 మరియు 1988లో చైనాకు వియత్నాంకు నడుమ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అత్యధిక భాగం ద్వీపాలు చైనా అధీనంలో వున్నాయి.

1973 నుండి 1982 వరకు ఐక్యరాజ్యసమితి నిర్వహించిన సదస్సులో జరిపిన చర్చల ఫలితంగా వచ్చిన ఒక అంతర్జాతీయ ఒప్పందమే 'యుఎన్‌సిఎల్‌ఓఎస్'. ఇది 1994 నుండి అమలులోకి వచ్చింది. ఈ యుఎన్‌సిఎల్‌ఓఎస్‌ను అంగీకరించి, ఆమోదిస్తూ 168మంది పైగా యూరోపియన్ యూనియన్ దేశాల ప్రతినిధులు దీనిపై సంతకాలు చేశారు. అమెరికా సామ్రాజ్యవాదం ఈ చర్చలలో పాల్గొని, తన ప్రయోజనాల కనుగుణంగా విధి విధానాలను రుద్దటానికి ప్రయత్నిస్తూ కూడా, అతి స్వల్ప కారణాలపై దానికి ఆమోదం తెలపలేదు. మూడవ ప్రపంచదేశాలు, ప్రత్యేకించి లాటిన్ అమెరికా దేశాలు, తమ హక్కుల పరిరక్షణకోసం అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తీవ్ర యుద్ధాన్ని సాగిస్తున్నాయి. లాటిన్ అమెరికా దేశాలు 20 నాటికల్ మైళ్ళ విస్తీర్ణంలో ప్రాదేశిక జలాల హక్కును డిమాండ్ చేస్తుండగా, అమెరికా సామ్రాజ్యవాదం దానిని 5 నాటికల్ మైళ్ళకు పరిమితం చేయబూనుకోవటం దానికి ఒక ఉదాహరణ. ప్రాదేశిక జలాలపై హక్కు 12 నాటికల్ మైళ్ళుగా నిర్ణయించిన తర్వాత కూడా, 200 నాటికల్ మైళ్ళ పరిధిలో 'ఇఇజెడ్'ను అమెరికా గుర్తిస్తూ కూడా, మరో వైపున యుఎన్‌సిఎల్‌ఓఎస్‌కు మాత్రం ఆమోదం తెలపకుండా వ్యవహరిస్తోంది.

చైనా, ఫిలిప్పీన్స్ మధ్య అతి చిన్నవైన దీవులు వివాద కేంద్రాలుగా ముందుకొచ్చాయి. ఈ సమస్యలను ద్వైపాక్షిక చర్చలద్వారా పరిష్కరించుకోవచ్చు. చైనాలో కమ్యూనిస్టుల పాలన కొనసాగిన ఈ అన్ని సం॥ల కాలంలోనూ ఈ విధమైన మార్గమెంచుకోనీయలేదు. గతకాలపు తన వలసదేశమైన ఫిలిప్పీన్స్‌యొక్క 'నౌకా మార్గం హక్కు' గురించి అమెరికా సామ్రాజ్యవాదానికి ఏలాంటి ఆసక్తీలేదు. గతంలోనూ, చైనాకు మరియు దాని పొరుగునున్న ఆగ్నేయాసియా దేశాల నడుమ తలెత్తిన ప్రాంతీయ వివాదాలలో అమెరికా జోక్యం చేసుకుని చీలికలను పెంచటానికే ప్రయత్నాలు చేసింది. దక్షిణ చైనా సముద్రంలో అమెరికాకు "జాతీయ ప్రయోజనాలు"న్నాయని గత 5 సం॥లుగా అది ప్రకటిస్తూ వుంది. చైనాను దౌత్యపరంగా, ఆర్థికంగా ఒంటరిచేసే ఉద్దేశ్యంతోనున్న అమెరికా సామ్రాజ్యవాదపు 'ఆసియా కీలు' అనబడే విశాల వ్యూహంలో భాగమిది.

ప్రస్తుతం ఉనికిలోవున్న 'అంతర్జాతీయ సూత్రాలపై ఆధారపడిన ఆదేశాని'కి కట్టుబడి వుండాలని అమెరికా సామ్రాజ్యవాదం పదేపదే పిలుపునిస్తోంది. అమెరికా సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలో రూపొందబడే ఈ సూత్రాలు ఇతర దేశాలు అమలుచేయటంకోసమే. కానీ, తమ చిత్తమొచ్చిన విధంగా అమెరికా వాటిని పరిహాసాస్పదంగా మార్చివేస్తుందనే విషయం మనందరకూ తెలిసిందే. 'సూత్రాలపై ఆధారపడిన ఆదేశమ'నే దానిపట్ల దానికేమాత్రం గౌరవం లేదు. శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం తన తీర్పును వెలువరించటానికి కొద్దిరోజులముందే అమెరికా రక్షణమంత్రిత్వశాఖ అనేక విధ్వంసక ఆయుధాలు, క్రూయిజర్స్‌తోపాటుగా యుఎస్ఎస్ రొనాల్డ్‌రీగన్ అనబడే యుద్ధవిమాన వాహకనౌకను దక్షిణచైనా సముద్రంలోకి నడుపుతూ ఈ వివాదాన్ని ముందుకు తేవటాన్ని మనం గమనించవచ్చు. అదేవిధంగా అమెరికా, ఫిలిప్పీన్స్‌తో ఓ నూతన, నీచ ఒప్పందం చేసుకుంది. చైనా అధీనంలో ద్వీపాలకు 12 నాటికల్ మైళ్ళ పరిధిలోకి అక్టోబర్‌నుండి విధ్వంసక నౌకలను పంపుతూ మూడు 'నావికా స్వేచ్ఛ' ప్రయత్నాలను అమెరికా సామ్రాజ్యవాద నావికా బలగాలు చేపట్టాయి. అంతర్జాతీయ సూత్రాల పట్ల అమెరికా సామ్రాజ్యవాదుల ఉల్లంఘనలను ఇవన్నీ నొక్కి చెప్తున్నాయి.

చైనా, జపాన్‌ల నడుమ సెంకాకు ద్వీపాల విషయమై ఒక వివాదం నడుస్తోంది. జపాన్, చైనాలు 'యుఎన్‌సిఎల్‌ఓఎస్'ను ఆమోదించినవే. అయితే, అవి ఏనాడూ శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానాన్ని ఆశ్రయించలేదు. ఆ వివాదం అలా వుంటూండగానే,

చైనా, జపాన్‌లు సెంకాకు ద్వీపాలపై ఆధిపత్యం అంశాన్ని ప్రక్కకుపెట్టి చేపలవేట హక్కు విషయమై ఒక ఒప్పందంపై సంతకం చేసుకున్నాయి. ఈ మధ్యలో అమెరికా సామ్రాజ్యవాదం 'అమెరికా – జపాన్‌ల నడుమ పరస్పర సహకారం, భద్రత ఒప్పందం' అని పిలవబడే ఓ ఒప్పందంపై జపాన్‌తో కలసి సంతకం చేసింది. సెంకాకు ద్వీపాలపై హక్కుకోసం జపాన్ నిలబడితే, జపాన్‌కు అండగా అమెరికా నిలబడుతుందనేది దీని అర్థం.

ఈ నేపథ్యంలో ఫిలిప్పీన్స్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయస్థానానికి విజ్ఞప్తి చేసింది. చైనా ఈ న్యాయస్థానం ముందు హాజరవటానికి నిరాకరించింది. దక్షిణచైనా సముద్రంలోని అనేకానేక ద్వీపాల సముదాయంపై చైనా ప్రకటిస్తున్న 'చారిత్రక హక్కులకు' ఏ విధమైన 'చట్టపరమైన ఆధారమూ' లేదని మధ్యవర్తిత్వ న్యాయస్థానం ప్రకటించింది. ఈ తీర్పు చాలా కుయుక్తితో కూడుకొన్నది. ఆ ద్వీపాలపై సార్వభౌమాధికార హక్కును చెలాయిస్తూ వుండగా, న్యాయస్థానం వాటిని చారిత్రక హక్కులుగా ఎంచి, కనుక వాటికి ఎటువంటి చట్టపరమైన ఆధారం లేదని ప్రకటించింది. వాస్తవానికి, సార్వభౌమాధికారాన్ని నిర్ణయించే అధికారం ఆ న్యాయస్థానానికి లేదు. కనుక, అది చైనా హక్కులను చారిత్రక హక్కుల క్రిందకు కుదించి వేసింది.

చిన్న చిన్న దీవులుగానున్న ఏవీ కూడా ద్వీపాలుగా పరిగణింపబడే లక్షణాలులేవని, కనుక 200 నాటికల్ మైళ్ళ ఇఇజెడ్ దీనికి వర్తించదని, ఆ విధంగా చైనా అధీనంలోనున్న ద్వీపాలపై హక్కులను పరిమితంచేస్తూ న్యాయస్థానం ప్రకటించింది. అదే సమయంలో, ఆ న్యాయస్థానమే ఇఇజెడ్‌కోసం ఫిలిప్పీన్స్‌కు అవకాశాన్ని విస్తరింపజేసింది.

శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థాన నిర్ణయంపట్ల చైనా స్పందన ఊహించిన విధంగానే వుంది. ఈ న్యాయస్థాన నిర్ణయం పూర్తి నిష్ఫలమైనదని, చైనా దీనిని గుర్తించబోవటంలేదని, ఆమోదించబోవటంలేదని చైనా ప్రకటించింది. వివాద పరిష్కారానికి ద్వైపాక్షిక చర్చలకు రావలసిందిగా చైనా, ఫిలిప్పీన్స్ ప్రభుత్వానికి పిలుపునిచ్చింది.

చైనా హక్కులను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించటం ద్వారా, అంతర్జాతీయ న్యాయస్థానం యొక్క నిర్ణయాలకు చైనా కట్టుబడటంలేదని అమెరికా సామ్రాజ్యవాదం దుష్ప్రచారాన్ని సాగించటానికి మధ్యవర్తిత్వ న్యాయస్థానం దోవచూపింది. అమెరికా గుత్తపెట్టుబడిదారీవర్గ పత్రిక అయిన 'వాల్‌స్ట్రీట్ జర్నల్' తన సంపాదకీయంలో అమెరికా యుద్ధోన్మాద స్పందనను కోరింది. 'ఐక్యరాజ్యసమితి ఆదేశాలను, దేశాలు స్వేచ్ఛగా వ్యవహరిస్తూ అమలు చేయకుంటే, ఐక్యరాజ్యసమితి ఆదేశాలకు అర్థమేదని' ఆ పత్రిక వ్యాఖ్యానించింది. దక్షిణ చైనా సముద్రంలో సైనిక నావికా చర్యలకు, నౌకాయాన స్వేచ్ఛకు మరింత స్వేచ్ఛ కావాలని, ఈ ప్రాంతంలో మరింత సైనికీకరణ జరగాలని ఆ పత్రిక పేర్కొంది. (12–7–16)

'రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దు' అని అమెరికా దేశీయాంగ మంత్రిత్వశాఖ పరోక్షంగా చైనాను ఉద్దేశించి ఓ ప్రకటనలో పేర్కొంది. అన్ని పక్షాలు అంతర్జాతీయ మధ్యవర్తిత్వ శాశ్వత న్యాయస్థాన తీర్పుకు కట్టుబడి వుండాలని పేర్కొంది. భారత ప్రభుత్వం దీనిని తు.చ. తప్పక అమలుచేసింది. సంబంధిత పక్షాలన్నీ అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడివుండాలని పిలుపునిస్తూ వివాదాలను శాంతియుత పద్ధతుల్లో పరిష్కరించుకోవాలని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. స్వేచ్ఛాయుత నౌకామార్గంలో, గగనమార్గంలో, సుదూర వాణిజ్యాలకు స్వేచ్ఛ వుండాలని తాము భావిస్తున్నట్లుగా ఆ ప్రకటన పేర్కొంది. దక్షిణ చైనా సముద్రంలో అమెరికా విధానాలతో గొంతు కలపటం మినహా ఇది వేరు కాదు.

అమెరికా సామ్రాజ్యవాద జోక్యం లేకుండా దక్షిణచైనా సముద్ర పరిసరాల్లోని దేశాలు తమ మధ్యనున్న వివాదాలను పరస్పర చర్చలద్వారా పరిష్కరించుకోవాలని 'జనశక్తి' భావిస్తోంది. దక్షిణచైనా సముద్రంలో తన ఆధిపత్యాన్ని పెంపొందించుకునే దానిలో భాగంగానే అమెరికా సామ్రాజ్యవాదం దక్షిణచైనా సముద్రంలో ఉద్రిక్తతలను తీవ్రమొనరుస్తోంది. అన్ని దేశాలు, ప్రభుత్వాలు, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల ప్రజానీకం ఈ చర్యలను తీవ్రంగా నిరసించాలి.

ooooo